ప్రజాశక్తి

సోమవారం 18 నవంబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ధరల నియంత్రణ ఏదీ?

• రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు • నియంత్రణ కమిటీ ఉన్నట్లా...లేనట్లా..!

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు నిత్యావసర సరుకులను ప్రజలకు విక్రయించాలి... ధరల్లో ఏమాత్రం తేడా వచ్చినా ఉపేక్షించేది లేదు... అలాగే కమిటీ ప్రతి వారం షాపులు తనిఖీ చేసి ధరలు అదుపులో పెట్టేలా చర్యలు తీసుకోవాలి... అదేవిధంగా వస్తువుల నాణ్యతలో ఎటువంటి తేడా వచ్చినా సహించేది లేదు... కావాలని అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని చూసినా ఉపేక్షించేది లేదు... బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడ్డ అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం... ఇదీ కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ నియంత్రణ కమిటీ సమావేశంలో చేసిన హెచ్చరికలు.

నిత్యావసర వస్తువుల ధరలపై జిల్లా కలెక్టర్ హెచ్చరికలు జారీ చేసిన వాటిని బేఖాతర్ చేస్తూ వ్యాపారస్తులు ధరలు తగ్గించకుండా రోజురోజుకు పెంచుకుంటూ పోతున్నారు. పైగా అధికారులు అలానే చెబుతారు వారు చెప్పిన ధరలకు అమ్మి నష్టపోవాలా అంటూ క్షేత్రస్థాయిలో వ్యాపారస్తులు చెబుతున్నారు. దీంతో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకీ పోటీపడి పెరుగుతున్నాయి. ధరలను అదుపు చేయాల్సిన ధరల పర్యవేక్షణ నియంత్రణ కమిటీ సమావేశాలకే పరిమితం అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు నిర్ణయించి వాటి ప్రకారమే ప్రజలకు నిత్యావసర వస్తువులు అమ్మాలని చెప్పినా క్షేత్రస్థాయిలో ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మాలంటే తమ వల్ల కాదని అలా చేస్తే తాము నష్టపోవాల్సి వస్తుందని, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంపెనీ వాళ్లే ఇవ్వరని అలాంటప్పుడు తాము ఎలా వినియోగదారులకు అందించగలమని వ్యాపారస్తులు బాహాటంగానే చెబుతున్నానంటే ప్రభుత్వ, జిల్లా కలెక్టర్ ఆదేశాలు అమలు చేసేది లేదని చెప్పకనే చెబుతున్నారు. అలాగే అన్ని సూపర్ మార్కెట్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో కూడా ప్రత్యేక కౌంటర్లు తెరిచి ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కందిపప్పు కిలో రూ.150, సోనామసూరి బిపిటి (స్టీమ్డ్) బియ్యం కిలో రూ.48, (మిగతా 2లో)

ఇసుక మాఫియా బెదిరింపులు

పోలీసులకు ప్రజాశక్తి చల్లపల్లి విలేకరి బాబూరావు ఫిర్యాదు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ప్రజాశక్తి చల్లపల్లి విలేకరి కుపంటి బాబూరావుపై ఇసుక మాఫియా బెదిరింపులకు పాల్పడింది. దుర్భాషలాడింది. చల్లపల్లి మండలం వెలువోలు గ్రామంలోని ఇంటికి వెళ్లి ఆదివారం రాత్రి బెదిరింపులకు పాల్పడ్డారు. వెలువోలులో ఇళ్లమధ్యలో ఇసుక అక్రమ డంపింగ్ చేస్తున్న ఫొటోలను బాబూరావు తీశారు. ఆదివారం వార్తను పత్రికకు పంపారు. ఈ నేపథ్యంలో ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తున్న గ్రామానికి చెందిన కుంపటి బసవయ్య(తెల్లబ్బాయి), కుంపటి కృష్ణలు విలేకరి బాబూరావు ఇంటికి వచ్చారు. విలేకర్లు పేపర్లలో వార్త రాసినా ఏమి పీకలేరు. మాకు అధికార పార్టీ అండ ఉంది. అధికారులు ఇసుక తోలుకోవడానికి అనుమతి ఇచ్చారు. మీరు ఎందుకు ఫొటోలు తీశారు..ఇంకో సారి ఫొటోలు తీస్తే ఊరుకోం.జాగ్రత్త అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు ముందే దుర్భాషలాడారు. దీనిపై బాబూరావు చల్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
సిపిఎం చల్లపల్లి మండల కమిటీ

ప్రజాశక్తి విలేకరి బాబూరావును ఇంటికి వెళ్లి బెదిరించిన ఇసుక మాఫీయాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిఐటియు చల్లపల్లి మండల కార్యదర్శులు యద్దనపూడి మధు, కరీముల్లాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరికి రక్షణ కల్పించాలని కోరారు. విలేకరిని బెదిరించడాన్ని ఖండిస్తూ వారు ప్రకటన విడుదల చేశారు.

బాబూరావుపై దాడికి
ఎపిడబ్ల్యూజెఎఫ్ ఖండన

ప్రజాశక్తి చల్లపల్లి మండల విలేకరి బాబూరావును ఇసుక మాఫీయా బెదిరించడం, దుర్భాషలాడటాన్ని ఎపిడబ్ల్యూజెఎఫ్ తీవ్రంగా ఖండించింది. విలేకరిని దుర్భాషలాడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్ష, వై.శ్రీనివాసరావు, కార్యదర్శులు జె.వెంకటప్పయ్య ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత

- సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు
- ఎన్‌టిఆర్ జిల్లా డిపిఒ లావణ్యకుమారి

ప్రజాశక్తి-విజయవాడ

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) పి.లావణ్యకుమారి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపైనా దృష్టి సారించినట్లు చెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల నిర్వహణతో పాటు ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటుమన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని పంచాయతీలు, వాటిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఆమె 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ఎన్‌టిఆర్ జిల్లాలో పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ తీరు ఎలా ఉంది?

జవాబు: జిల్లాలోని పంచాయతీల అభివృద్ధితో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా పనులు జరుగుతున్నాయి. ప్రతి పంచాయతీ పరిధిలో రోడ్లతో పాటు డ్రైయినేజీల స్వీపింగ్, క్లీనింగ్ నిత్యం జరిగేటట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అక్కడున్న జనాభా, వనరుల ఆధారంగా పంచాయతీలో క్లీనింగ్ జరిగేటట్లు పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న 288 పంచాయతీల్లో ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంటుంది. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 1303 ఔట్ సోర్సింగ్ కార్మికులతో పాటు మరో ఎనిమిది మంది పర్మినెంట్ కార్మికులు పారిశుధ్య పనులు జిల్లాలోని పంచాయతీల్లో పని చేస్తున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత పంచాయతీల్లో కొత్తగా పారిశుధ్య కార్మికులను భర్తీ చేసుకోవాల్సి ఉంది. పూర్తిస్థాయిలో కార్మికులను భర్తీ చేసుకొని పారిశుధ్య మెరుగుదలకు (మిగతా 2లో)

ముగింపు సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

అదరహో...

గత మూడు రోజుల నుంచి చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీస్తూ విజయవాడ సిద్ధార్థ అకాడమీలో ఉత్సాహంగా సాగిన అమరావతి బాలోత్సవం ఏడో పిల్లల పండుగ ఆదివారం ముగిసింది. జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డ్యాన్స్, లఘు నాటికలు, దేశభక్తి గీతాలాపన, కోలాటంతో పాటు క్విజ్, మట్టితో బొమ్మలు చేయడం, సైన్స్ ప్రదర్శన, పద్యభావం, తెలుగులో మాట్లాడటం, వంటి పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. దాదాపు 200 పాఠశాలల నుండి 15 వేల మందికి పైగా విద్యార్థులు అకడమిక్, కల్చరల్ విభాగాల్లో 60 అంశాల్లో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల వికాసం కోసం ప్రత్యేక మండలి ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల్లో అద్భుతమైన శక్తులు ఉన్నాయని వాటిని వెలికితీసి సమాజానికి మంచి పౌరులను అందించాలని అన్నారు. పిల్లల కోసం, వారి వికాసం కోసం కృషి చేసే సంస్థలు రావాలన్నారు.

... వార్తలు ప్రధాన సంచికలో, జిల్లా మధ్యపేజీలో

వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన చిన్నారులు

అలరించిన బాలల ప్రదర్శనలు

ముగిసిన అమరావతి బాలోత్సవం

విజేతలకు బహుమతులు అందజేసిన ఎంఎల్‌సి లక్ష్మణరావు

చిన్నారుల ప్రదర్శనలు

బదిలీల దుమారం

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ల భర్తీలో నిబంధనలకు తూట్లు
- కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని సీనియర్లు పట్టు
- ఎప్పుడూ లేని విధానం ఎందుకంటున్న జూనియర్లు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీల వ్యవహారం దుమారం రేపుతోంది. నగరపాలక సంస్థలోని ఆయా విభాగాల్లో అంతర్గత బదిలీలు అవసరాల రీత్యా సహజంగానే ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాల మేరకు జరుగుతుంటాయి. ప్రస్తుతం సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారు కోరుకున్న డివిజన్‌ను కేటాయించిన తరువాత... జూనియర్లకు మిగిలిన డివిజన్లను కేటాయించాలనే ప్రతిపాదనను కొద్దిరోజుల క్రితమే నగర కమిషనర్ వద్ద పంచాయితీ పెట్టినట్లు సమాచారం. కమిషనర్ మాత్రం ఈ వ్యవహారాన్ని ప్రజారోగ్య విభాగం ఇన్‌చార్జి ముఖ్యఅధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ సురేష్‌బాబు వద్దకు పంపించినట్లు తెలిసింది. ఈ నెల 29న కౌన్సిల్ ముగిసిన అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీ వ్యవహారాన్ని పరిశీలిస్తామని, అప్పటి వరకు ఇప్పుడున్నట్లుగానే విధులు నిర్వర్తించాలని, అన్ని రకాలుగా పరిశీలించిన అనంతరమే హేతుబద్ధంగా, పారదర్శకంగా బదిలీ ఉంటుందనే దిశగా కమిషనర్ సీనియర్ల వద్ద వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కౌన్సిలింగ్ ద్వారా సీనియార్టీ ప్రాతిపదికన డివిజన్ల కేటాయింపు ఇటీవల కాలంలో ఎన్నడూ జరగలేదని, అంతేగాక నగరపాలక సంస్థ పరిధిలోని విభాగాల్లో అంతర్గత బదిలీలు జరిగే సమయంలో ఇటువంటి పాలసీని అమలుచేస్తున్న పరిస్థితి లేదని, ప్రజారోగ్య విభాగంలోనే ఇటువంటి విధానాన్ని ఎందుకు ముందుకు తీసుకొచ్చారో...దీని వెనుకాల మతలబు ఏమిటో సీనియర్లే చెప్పాలంటూ పలువురు జూనియర్ ఇన్‌స్పెక్టర్లు ప్రశ్నిస్తున్నారు. సీనియర్లా... జూనియర్లా అని కాకుండా...వర్క్‌లో వారి శక్తిసామర్థ్యాలు, డివిజన్, పనిపై అతనికుండే అవగాహన, కార్మికులతో పని చేయించకల్గే పరిస్థితి, స్థానిక అవసరాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని...ఎవరిని ఏ డివిజన్‌కు పంపిస్తే బాగుంటుందనే దిశగా ఆలోచించి, ఉన్నత స్థాయి అధికారులు నిర్ణయం చేయాలే కానీ.. ఏదో ఒక పలుకుబడి ఉపయోగించి, లాభదాయకమైన డివిజన్‌ను చేజిక్కించుకోవచ్చుననే దురాలోచనతో...సీనియర్ల ప్రతిపాదన తీసుకొచ్చారని నిర్ణయం చేస్తే ఇప్పటి వరకు అనుసరించిన విధానం, పద్ధతులను బ్రేక్ చేసినట్లేనని పలువురు జూనియర్లు, సీనియర్లు సైతం గుర్తు చేస్తున్నారు.

విజయవాడ నగరంలోని 64 శానిటరీ డివిజన్లలో అన్ని రకాల అర్హత కలిగిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు. విద్యా అర్హతతో పాటు సీనియార్టీ ఇలా అన్ని రకాలుగా పరిశీలించినా...కేవలం 22 మంది లోపు మాత్రమే అర్హత కలిగిన ఇన్‌స్పెక్టర్లు ఉన్నట్లు రికార్డులు విధితం చేస్తున్నాయి. మిగిలిన వారిలో అత్యధిక మంది ఎటువంటి అర్హత లేనివారున్నారు. ఆర్థిక, రాజకీయ, ఇతర పలు రకాల పలుకుబడులను ఉపయోగించి, ఏదో ఒక రకంగా అత్యంత సులువుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు రాత్రికి రాత్రే కొట్టేసిన ఘనాపాటీలు విఎంసిలో అనేక మంది లేకపోలేదు. మా పిహెచ్ వర్కర్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఇవ్వాలని ఒక నియోజకవర్గం ఎమ్మెల్యేనో...ఇతర ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే...అటువంటి వారిని కూడా భర్తీచేసే దౌర్భాగ్య స్థితి ప్రజారోగ్య విభాగంలో సర్వసాధారణంగా తయారయిందని తోటి ఇన్‌స్పెక్టర్లు బాహటంగానే వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లలో అత్యధిక మంది పిహెచ్ వర్కర్, లీడ్ మేస్త్రీగా పని చేసిన వారే. సుమారు 40 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఎటువంటి అర్హత, అనుభవం లేదని గుర్తు చేస్తున్నారు. ఇటువంటి వారితో పాటు ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి సిఎంఒహెచ్ దగ్గర నుంచి ఎంఒహెచ్‌ల వరకు అందరూ అర్హత లేని వారే. ప్రజారోగ్య విభాగంలో అంతా గందరగోళం నడుస్తుంది. కార్మికుల దగ్గర నుంచి అధికారుల వరకు అందరూ కొరతగానే ఉన్నారు. అడుగడుగునా అవినీతి రాజ్యమేలుతోంది. ఔట్ సోర్సింగ్‌లో కార్మికుడికి పని కల్పించే దగ్గర నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ ఇలా అన్ని దశల్లోనూ అవినీతి రాజ్యమేలుతున్న తరుణంలో త్వరలో జరిగే శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కౌన్సిలింగ్ వ్యవహారం కూడా విఎంసిలో పెద్ద దుమారాన్ని రేపనుంది.

నేడు విఎంసిలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు వినతులు సమర్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించాలని కోరారు.

ఓవరాల్ ఛాంప్ నిర్మల సిబిఎస్ఇ పాఠశాల

మంగళగిరి రూరల్: మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల పాఠశాలలో సి ఎస్ ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14వ సాహిత్య మరియు లలిత కళల పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నాలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పోటీ పడగా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ని నిర్మల సిబిఎస్ఈ పాఠశాల కైవసం చేసుకుంది.

మొదటిపేజీ తరువాయి

ధరల నియంత్రణ ఏదీ?

సోనా మసూరి బిపిటి (రా) బియ్యం రూ.47 చొప్పున, అలాగే సన్నవర్ నూనె ప్యాకెట్లను లీటర్ 124 రూపాయలు చొప్పున, పామోలిన్ నూనె లీటర్ 114 రూపాయలు చొప్పున విక్రయించాలని చెప్పినా ఈ ధరలకు ఎక్కడా అందుబాటులో లేవు. అలాగే ప్రత్యేక కౌంటర్లు ఎక్కడ కనిపించడం లేదు. దీంతో వినియోగదారులందరూ బహిరంగ మార్కెట్‌లోనే నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల వినియోగదారులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కందిపప్పు 180, సన్‌ఫ్లవర్ ఆయిల్ 140, పామాయిల్ 120, ఉల్లిపాయలు (కర్నూల్) 65, సోలాపూర్ 75 రూపాయలకు అమ్ముతున్నారు. సన్ ఫ్లవర్ ఆయిల్ అయితే చాలా షాపుల్లో వారి ఖాతాదారులకు మాత్రమే విక్రయిస్తున్నారు. బ్లాక్ మార్కెట్ చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలక్టర్ హెచ్చరించినా వ్యాపారస్తులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. పైగా తమ ఖాతాదారులకు ఇవ్వకుంటే రేపు వారు మరలా తమ షాపుకు రారు అని చెబుతున్నారంటే నిత్యావసర వస్తువుల ధరలు ఏమాత్రం తగ్గించే అవకాశం లేదని తెలుస్తోంది. మరి నిత్యావసరాల ధరల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత

మరింతగా కృషి చేయడం జరుగుతుంది.

ప్రశ్న: సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా, ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పరిసరాల పరిశుభ్రతతో పాటు వీధుల్లో బ్లీచింగ్, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు, అలాగే ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం జరుగుతుంది. అక్కడక్కడ సీజనల్ వ్యాధులు వచ్చినా కానీ వాటి నివారణకు హెల్త్ విభాగాన్ని అప్రమత్తం చేసి, ఎప్పటికప్పుడు వ్యాధుల నివారణకు చర్యలు ఉంటున్నాయి. మంచినీటి ట్యాంకులు క్లీనింగ్ చేయడం జరుగుతుంది. మంచినీటి క్లోరినేషన్ చేయడం జరుగుతుంది. మలేరియా, దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ స్ప్రే చేయించడం జరుగుతుంది. డ్రెయిన్లు, రోడ్ల పక్కన గార్బేజ్, ముళ్ల పొదలున్నా వాటిని తొలగించడం జరుగుతుంది. నీటి కాలుష్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పంచాయతీల్లో నిధుల ఆధారంగా క్లీనింగ్ చర్యలు తీసుకోవడం, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పబ్లిక్‌హెల్త్, పంచాయతీ అధికారులు, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయడం జరుగుతుంది. విజయవాడ రూరల్, తిరువూరు, కంచికచర్ల తదితర పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి, స్థానికంగా తీసుకోవాల్సిన కార్యక్రమాలు, సీజనల్ వ్యాధుల నివారణపైప్రత్యేక ప్లాన్ రూపొందించాం.

ప్రశ్న: ఆస్తి పన్నులు ఎంత వసూలు చేశారు?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలోని పంచాయతీల నుంచి ఇంటి పన్నుల రూపంలో రూ.133 కోట్ల మేర డిమాండ్ ఉంది. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 4.40 లక్షల ఎసెస్‌మెంట్లు ఉన్నాయి. మిగిలిన పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేయడానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: పంచాయతీల నుంచి విద్యుత్ బకాయిలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: గడిచిన 2020-23 నాటికి జిల్లాలో రూ.158.54 కోట్ల మేర విద్యుత్ బకాయిలున్నాయి. ఇప్పటికీ ఇంకా ఎక్కువగానే చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి నాటికి రూ.1.56 కోట్ల బకాయిలు చెల్లింపులు జరిగాయి.

అలవెన్స్‌ల చెల్లింపుల్లో ఆర్‌టిసి నిర్లక్ష్యం

- రెండేళ్లుగా తనిఖీ సిబ్బంది అవస్థలు
- స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

ఎపిఎస్ ఆర్‌టిసి తనిఖీ సిబ్బంది అలవెన్స్‌ల చెల్లింపులో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనమైనప్పటి నుంచి ఒక్కసారి కూడా అలవెన్స్ చెల్లించలేదు. రవాణాశాఖ సెక్రటరీ చెల్లింపులపై ఉత్తర్వులు ఇచ్చినా ఆచరణకు నోచుకోలేదు. ఈ తనిఖీ విభాగంలో పనిచేసే ఉద్యోగులు ఒక్కొక్కరూ నెలకు రూ.6 వేల వరకు తమ జీతాల నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నా పరిష్కరించకపోవడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది.

టికెట్ లేని ప్రయాణికులను, ఆర్థిక అవకతవకలను నియంత్రించడానికి ఆర్‌టిసిలో మూడు రకాల తనిఖీ వ్యవస్థలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీ వ్యవస్థల్లో 107 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. విజయవాడ రీజనల్ హెడ్ క్వార్టర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్ (ఆర్ఇఎస్), రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లలో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో 25 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఉద్యోగులు వారంలో ఐదు రోజులు ఇక్కడ ఉండి వెళ్లే అవకాశం లేదు. సంస్థ ఇన్‌చార్జి సూచించిన రూట్లలో ప్రతి రోజూ బస్సులను తనిఖీ చేయాలి. డే హాల్ట్, నైట్ హాల్ట్‌లు చేయాలి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంలో విలీనం అయ్యే వరకు వీరికి రోజుకు రూ.300 చొప్పున 20 రోజులు టీ, టిఫిన్, భోజన ఖర్చులకు నెలకు రూ.6 వేలు డే అవుట్, నైట్ అవుట్ అలవెన్స్‌గా స్క్వాడ్ ఉద్యోగులకు ఆర్‌టిసి చెల్లించింది. ఈ చెల్లింపులకు సంబంధించి జివో 114లో స్పష్టత ఉంది. అయితే ఈ జివో అమలుకు నోచుకోవడం లేదు. 2022 సెప్టెంబర్లో ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనమైంది. తర్వాత 26 నెలలుగా అలవెన్స్‌లు నిలిచిపోయాయి. ఆర్‌టిసి ఈ విభాగంలోని ఒక్కో ఉద్యోగికి సగటున రూ.1.56 లక్షల వరకు అలవెన్స్ చెల్లింపు పెండింగ్‌లో ఉంది.

అమలుకు నోచని రవాణా సెక్రటరీ ఉత్తర్వులు

ఉద్యోగులు తమ సమస్యను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. అలవెన్స్ చెల్లింపుపై రవాణాశాఖ సెక్రటరీ ఉత్తర్వులిచ్చారు. అయితే ఈ ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం తీసుకువచ్చిన కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (సిఎఫ్ఎంఎస్)లో నెలవారీ అలవెన్స్‌ల చెల్లింపులకు అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం అలవెన్స్‌లకు ప్రత్యేక కేటాయింపులు చేసినప్పుడు చెల్లింపులు ఉంటాయని చెప్పడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది.

మండల, మున్సిపల్ స్థాయిలోనూ పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ నెల 18వ తేదీ సోమవారం నుంచి మండల, మున్సిపల్ స్థాయిలోనూ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ డా. నిధిమీనా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సమీప మండల, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రజలకు సుపరిపాలనను మరింత చేరువ చేసేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని వల్ల త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. విస్తృత ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిబద్ధతతో ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

29న విఎంసి కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహించాలని పాలకపక్షం నిర్ణయించింది. ప్రతి మూడు మాసాలకు ఒక సారి జరిగే కౌన్సిల్ సమావేశం గత ఆగస్టు 28వ తేదీన జరిగింది. మరలా ఈ నెల 29న కౌన్సిల్ జరుగుతుంది. ఈ మేరకు కౌన్సిల్ సమావేశం సమాచారాన్ని కార్పొరేటర్లకు సెక్రటరీ సెల్ ద్వారా ఇప్పటికే పంపించారు. దీంతో కార్పొరేటర్లు వారి వారి డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలను ప్రతిపాదనల రూపంలో అజెండాలోకి తీసుకొచ్చే పనిలో ఉన్నారు. వరదలు, కార్మికుల సమస్యలు, నగరానికి రావాల్సిన పెండింగ్ నిధులు తదితర అంశాలపై సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ఇప్పటికే పలు ప్రతిపాదనలను సెక్రటరీ సెల్‌కు అందజేసినట్లు సమాచారం. ఇదే రీతిలో అధికార, ప్రధాన ప్రతిపక్ష టిడిపి సభ్యులలోని పలువురు ముఖ్యమైన సమస్యలను ప్రతిపాదనల రూపంలో సెక్రటరీ సెల్‌కు పంపిస్తున్నారు. పది రోజుల సమయం ఉండటంతో కౌన్సిల్ నిర్వహణ, అజెండాలోకి తీసురావాల్సిన అత్యవసర అంశాలపై ఆయా విభాగాల అధికారులను కమిషనర్ ఇప్పటికే డైరెక్షన్ ఇచ్చినట్లు తెలిసింది. అదే విధంగా నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు తెలిసింది. దీంతో పాటు వచ్చే నెల 1న తేదీన పిక్‌నిక్ నిర్వహించాలని, విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లి రాజా మామిడితోటలో జరుపుకోవాలని నిర్ణయించినట్లు మేయర్ కార్యాలయం తెలిపింది. కౌన్సిల్, స్టాండ్ కమిటీ, పిక్‌నిక్ వరుస షెడ్యూల్‌తో వాటిని నిర్వహించే దానిలో అధికారులు బిజీబిజీగా ఉన్నట్లు తెలిసింది.

మహారాష్ట్రీ VII వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, విజయవాడ
ఐ.పి.నెం: 9/2022

పిటీషన్ :
పాటిబండ్ల శ్రీనివాసరావు - పిటీషనర్
మరియు
నూతలపాటి రవిబాబు మరియు ఇతరులు - రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ నెం-5
పాలడుగు శ్రీలక్ష్మీ, భర్త: సురేష్
R/o. డోర్.నెం: 28-12-2, మోడరన్ కాంప్లెక్స్ పైన, రామమందిరం ఎదురు, ఏలూరు రోడ్డు అరండల్ పేట, విజయవాడ, ఎన్.టి.ఆర్.జిల్లా.

పై నెంబర్ పిటీషన్ నందు 5వ రెస్పాండెంటు నోటీసు నిమిత్తం ది. 05-12-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు పైన తెలిపిన 5వ రెస్పాండెంటు గాని, వకీలు ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలను తెలుపుకోగలరు. ఆక్షేపణలు ఉన్న యెడల పైన తెలిపిన కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా: 05-12-2024.

ఇట్లు
వి. శ్రీనివాసరావు, న్యాయవాది
విజయవాడ. సెల్: 9440151529

అసంపూర్తిగా పాఠశాలల భవన నిర్మాణాలు

● వసతులు లేనిచోట్ల బోధనలు ● విద్యార్థుల తీవ్ర ఇక్కట్లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలో రెండేళ్లుగా పాఠశాల భవనాలు నిర్మాణం కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మూడు గ్రామాల ప్రాథమిక పాఠశాలలు శిథిలం కావడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి నాడు-నేడు పథకం ద్వారా నిధులు మంజూరు చేశారు. అయితే రెండు సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో భవనాల నిర్మాణం నిలిచిపోయాయి. దీని కారణంగా ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణను వసతులు లేని ఇరుకైన కమిటీ హాల్‌లో, గుడి షెడ్యూల్లో, పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని కవుతరం ప్రాథమిక పాఠశాల కాశీగూడ దళితవాడలో 26 మంది విద్యార్థులకు పాఠశాలను కమిటీ హాల్ లో నిర్వహిస్తున్నారు. చింతలకుంట గ్రామంలోని పాఠశాలో 12 మంది విద్యార్థులతో అంకమ్మ గుడి షెడ్‌లో నిర్వహణను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మామిడికోళ్ల గ్రామంలోని పాఠశాలను పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. గుడ్లవల్లేరు ప్రాథమిక పాఠశాల-2లో 60 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఆ భవనం పై భాగంలో మరో రెండు గదులు నిర్మాణానికి నాడు నేడు కింద 16 లక్షలు నిధులు నిర్మాణం చేపట్టారని ఉపాధ్యాయులు తెలిపారు. అయితే నాలుగు లక్షల మాత్రమే బిల్లు రాగా అంతవరకే నిర్మాణం జరిగినట్లు దీని కారణంగా అసంపూర్ణంగా ఉందన్నారు. విద్యార్థులకు విద్య బోధించేందుకు ఇరుకైన గదులలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై కొంతమంది తల్లిదండ్రులు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు విన్నవించగా ఆయన దీనిపై స్పందించి 2025 జనవరిలో నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కవుతరంలో ఆగిన పనులు

చింతలకుంటలో పిచ్చి మొక్కలు మొలచిన దృశ్యం

గుడ్లవల్లేరులో మధ్యలోనే నిలిచిన భవనం పనులు

దీక్షలో కూర్చున్న నాయకులు

రిలే దీక్షలు విరమణ

ప్రజాశక్తి-బంటుమిల్లి : నదుల్లో నీరు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం దాళ్వా వరిసాగుకు అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమని రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ఆరోపించారు. దాళ్వా వరి సాగుకు అనుమతివ్వాలని కోరుతూ బంటుమిల్లి సెంటర్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో తొమ్మిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో సముద్ర తీర ప్రాంతం,ఉప్పు ప్రాంతం అవ్వడం వల్ల 90 శాతం భూముల్లో మినుములు, అపరాలు పంట పండిస్తున్నా కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. దాదాపు నాలుగు సంవత్సరాల నుండి రైతాంగం నష్టపోతున్నదన్నారు. అనంతరం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సందర్భంగా ఈ దీక్షలను తాత్కాలికంగ నిలుపుదల చేస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈకార్యక్రమంలో రైతు నాయకులు లంకదాసుల అజయ్ ఘోష్, సుజ్ఞానం జనార్ధనరావు, పుప్పాల నరసింహారావు, వెంట్రపాటి సురేష్, యర్రా రమేష్, ప్రత్తి పాండురంగారావు, చిగురు శెట్టి అంకినీడు, గౌరిశెట్టి నారాయణ, పాల్గొన్నారు.

వెండి గిన్నె అందిస్తున్న దృశ్యం

కొండలమ్మ దేవస్థానంలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఆదివారం సందర్భంగా అమ్మవారిని సుమారు 7వేల మంది యాత్రికులు దర్శించుకున్నారు అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏలూరు గ్రామానికి చెందిన బలభద్ర సర్వేశ్వర గుప్తా జ్ఞాపకార్థం వారి కుమారుడు బలభద్ర పవన్ కుమార్ అమ్మవారికి సుమారు 0.998 గ్రాములు వెండి గిన్నె కానుక సమర్పించారు.

హంసలదీవికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-కోడూరు : హంసలదీవి పాలకాయతిప్ప సాగర తీరానికి ఆదివారం సెలవు దినం కావడంతో దూర ప్రాంతాలను విహారయాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వనభోజన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. కోడూరు ఎస్సై చాణిక్య పర్యాటకులకు సముద్రంలో స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చిన్నారులు సముద్ర తీరాన కబడ్డీ, వాలీబాల్ లాంటి ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. మెరైన్ పోలీసులు, కోడూరు పోలీసులు తీరం వెంబడి గస్తీ నిర్వహించారు.

రెడ్ వాలంటీర్ల సేవలు ఆదర్శనీయం : గన్నే

ప్రజాశక్తి-గన్నవరం : రెడ్ వాలంటీర్లు చేస్తున్న సామాజిక సేవలు ఆదర్శనీయమని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఆర్థిక విశ్లేషకులు గన్నే వెంకట్రావు అన్నారు. ఆదివారం గన్నవరం పంచాయితీ పరిధిలోని బుద్ధవరం రోడ్డులో సుందరయ్య రెడ్ వాలంటీర్లు శ్రమదానం ద్వారా ముళ్ళ పొదలను తొలగించారు. మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని వెంకట్రావు ప్రారంభించి మాట్లాడుతూ. ప్రభుత్వమే అన్ని కార్యక్రమాలను చేయలేదని, యువకులు సంఘాలుగా ఏర్పడి సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి మాధవి, రెడ్ వాలంటీర్ల కమిటీ కన్వీనర్ మోటమర్రి నాగ బ్రహ్మాచారి, డాక్టర్ మద్దుకూరి విజయ్‌కుమార్, రెడ్ వాలంటీర్లు మల్లంపల్లి ఆంజనేయులు,కళ్ళం కోటయ్య, మిరప నాగేశ్వరరావు, సూరగని సాంబశివరావు, బి.నాగరాజు, కళ్ళం వెంకటేశ్వరరావు, చిటికెల రాజేశ్వరరావు, కడవకొల్లు రామరాజు పాల్గొన్నారు.

శ్రమదానం చేస్తున్న వాలంటీర్లు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-నాగాయలంక : రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబానికి నాగాయలంక మండల ఎస్సీ. ఎస్టీ కమిటీ సహకారంతో ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. మండలంలోని పర్రచివర పంచాయితీ పరిధిలో గల మెరక పాలెం గ్రామానికి చెందిన చాట్రగడ్డ జానకి రామయ్య ఈనెల ఆరో తేదీన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న నాగాయలంక మండల ఎస్సీ. ఎస్టీ కమిటీ సహకారంతో ఐదు వేల రూపాయల జానకి రామయ్య భార్యకి ఆర్థిక సాయం అందచేశారు. నాగాయలంక ఎస్సీ, ఎస్టీ కమిటీ ప్రెసిడెంట్ మంచాల వీర వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కందుల శంకర్, సెక్రటరీ. తానంకి పోతురాజు, కోశాధికారి శేఖర్‌బాబు, చోడవరం సర్పంచ్ కైతేపల్లి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలకు టీడీపీ గ్రామ అధ్యక్షులు దాసరి విజయరావు, గ్రామ ఉప సర్పంచ్ యనమదల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. గ్రామంలో సుమారు 50 లక్షల రూపాయల నిధులతో నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ప్రముఖ కాంట్రాక్టర్ బొబ్బ సాంబశివరావు, గొల్లనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్ కొలుసు రాంబాబు, టీడీపీ నాయకులు గణపవరపు వెంకయ్య పాల్గొన్నారు.

వెండి నాగపడగ బహూకరణ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం భద్రాది జిల్లా, కొత్త గూడెంకు చెందిన గొడిశీల కళ్యాణ్ శేఖర్ ఒక కిలో బరువు కలిగిన వెండి నాగపడిగ (సుమారుగా 92 వేల రూపాయలు) స్వామివారికి కానుకగా ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. సిబ్బంది బర్మా ప్రసాద్ ప్రసాదాలు అందజేశారు.

వెండిగిన్నె బహూకరిస్తున్న దృశ్యం

రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

● చైర్మన్‌గా గుడివాడ శేషుబాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ బ్రాంచ్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన చైర్మన్‌గా జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేష బాబును ఎన్నుకున్నారు. ఆదివారం సొసైటీ కార్యాలయం వద్ద డిప్యూటీ తాసిల్దార్ ఏ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ వంగర శేషగిరిరావు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్గా గుడివాక శేషుబాబు, వైస్ చైర్మన్ గా గరికపాటి హరిప్రసాద్, కార్యదర్శిగా ఏ వీరకుమారి, జాయింట్ సెక్రటరీగా కోడూరు శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా అల్లంశెట్టి వెంకటేశ్వరరావుతో పాటు మరో 10 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి రెడ్ క్రాస్ సభ్యులు అభినందనలు తెలిపారు.

గుడివాడ శేషుబాబు

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన పార్టీ నాయకులు, నరసాపురం నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు వేడుకలు అవనిగడ్డలోని నాలుగో వార్డ్‌లో అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. యూత్ ఫోర్స్ నాయకులు వడుగు నాగార్జున, కోలా వెంకటేశ్వరరావు, పొక్కిలిగడ్డ నాంచారయ్య, నాగిడి అమలేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అదరహో...

- ముగిసిన అమరావతి బాలోత్సవం
- విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని సిద్దార్థ అకాడమీ వేదికగా, మూడు రోజుల పాటు నిర్వహించిన అమరావతి భాలోత్సవ్ 7వ పిల్లల పండుగ ఆదివారం ముగిసింది. సుమారు 200 స్కూళ్లకు నుంచి 15 వేల మంది బాలబాలికలు మూడు రోజులు పాటు వివిధ అంశాలలో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు జరిగింది. కార్యక్రమానికి బాలోత్స వాలకి ఆద్యులు, 25 ఏళ్ళ పాటు కొత్త గూడెంలో బాలోత్సవం నిర్వహించిన డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఆనందంగా జీవించాలంటే బాల్యాన్ని కాపాడు కోవాలని సూచించారు.ఎప్పుడైతే మన బాల్యాన్ని పోగొట్టుకుంటామో సజన ఉండదన్నారు. బాలోత్సవంకు వెళ్లిన పిల్లల్లో ఎంతో మార్పు వచ్చిందని వారి తల్లి దండ్రులే చెబుతున్నారని రమేష్ బాబు వెల్లడించారు. శాసన మండలి సభ్యులు కేస్ లక్ష్మణ రావు మాట్లాడుతూ, పెద్దలందరు నిలబడి పిల్లల కోసం ఇంతమంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 78 లక్షలు మంది ప్రభుత్వ స్కూల్లాలోనూ, 37 లక్షల మంది ప్రైవేట్ స్కూల్లాలోనూ చదువుతున్నారని అన్నారు. ప్రభుత్వం పిల్లల వికాసం కోసం ఒక ప్రత్యేక మండలి ఏర్పాటు చేయాలన్నారు. కాకినాడ క్రియ పిల్లల పండుగ అధ్యక్షులు జగన్నాధరావు మాట్లాడుతూ పిల్లలకు అట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు లేకుంటే, చదివే చదువులో సమగ్రత, పరిపూర్ణానత ఉండదన్నారు. బలోత్సవ అధ్యక్షులు ఎస్పి రామ రాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండల రావు, కార్యదర్శి పిన్నమనేని మురళి కష్ణ, కెనరా బ్యాంకు జిఎం విజయ లక్ష్మి, స్వరూప రాణి తదితరులు సభలో పాల్గొన్నారు. గిడుగు రవీంద్ర నాథ్ సభకు అధ్యక్షత వహించారు. అనంతరం మూడవ రోజు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా పోటీలు

అమరావతి బాలోత్సవ్ చివరి రోజు ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కల్చరల్ విభాగంలో జానపద గీతాలపన, ఏకపాత్రాభినయం, కోలాటం, ముఖాభినయం అంశాలలో పోటీలు ఉత్సాహ భరితంగా జరిగాయి. అకడమిక్ విభాగంలో క్విజ్,తెలుగులో మాట్లాడటం, పద్యం, కథ చెప్పడం వంటివాటిలో జరిగాయి.

అభినందన...

చివరిరోజు ఆదివారం చిన్నారుల పోటీల ప్రదర్శనను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించారు. పలు పోటీలను, చిన్నారుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా చిన్నారులను అభినందించారు.

మాట్లాడుతున్న మురళీకృష్ణ

జగన్

రవీంద్రనాథ్

శ్రీరామ్

విజయలక్ష్మి





ఏకపాత్రాభినయంలో అలరిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు





ప్రదర్శనలు తిలకిస్తున్న వి. శ్రీనివాసరావు

వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ఫౌండేషన్ వారి సహకారంతో విజయవాడలోని వివిధ ప్రాంతాల్లో వరద బాధితులకు ఆదివారం ప్రత్యేక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి కృష్ణా జిల్లా లయన్స్ క్లబ్ 316 డి గవర్నర్ గద్దె శేషగిరిరావు పాల్గొని అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్‌కె 'బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వరద బాధితులకు నిత్యావసర సరుకుల ప్రత్యేక కిట్లు పంపిణీని చేశారు. సివిఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ప్రెసిడెంట్ పి.వి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రీజనల్ చైర్మన్ ఎ.శరాబందిరావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ నాయకులు షేక్ అబ్దుల్ రషీద్, ఎమ్.ఎస్.ఇమామ్ బాషా, తాటి వెంకట నారాయణ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. క్లబ్ సెక్రటరీ జి.నాగరాజు, క్లబ్ మహిళా నాయకురాలు లాం సునీత, డైరెక్టర్లు టి.సాంబశివరావు, పీ.వేంకటేశ్వరరావు, బి.చతుర్వేది, బుడ్డా వేంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు. కిట్‌లో మఖ్మల్ దుప్పటి, టవల్, లుంగీ, చీర, జాకెట్టు, రెండు స్టీల్ పళ్ళాలు, గ్లాసులు, బియ్యం, గోధుమ పిండి, చింతపండు, కందిపప్పు, పంచదార, మిర్చి, పసుపు, పౌడర్లు, ఉప్పు, రిఫైండ్ ఆయిల్, మొదలగు నిత్యావసర వస్తువులలో కూడిన కిట్లు పంపిణీ చేశారు. వరద బాధితులు లయన్స్ క్లబ్ వారికి ధన్య వాదాలు తెలిపారు.

బంగారు కాసుల పేరు అందజేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దుర్గమ్మ దేవాలయానికి అపార్ట్‌మెంట్, గొల్లపూడి, విజయవాడకు చెందిన ఏ.సూరిబాబు, కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం ఆదివారం ఆలయ అధికారులను కలిసి 65 గ్రాముల బరువు కలిగిన బంగారు కాసుల పేరును కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అధికారులు దర్శనం కల్పించి, వేదపండితులు వేదార్వచనం చేయించి, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

భారాలకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం

వైసిపి సెంట్రల్ సమన్వయకర్త విష్ణు

ప్రజాశక్తి - విజయవాడ : వరదల పేరుతో ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డనకు సిద్ధమైందని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు ఆరోపించారు. రాష్ట్ర జిఎస్‌టిపై 1 శాతం అదనం సర్ ఛార్జీని విధించేందుకు వెసులుబాటు కల్పించాలని సిఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరడాన్ని ఆయన తప్పుబట్టారు. కేంద్రం నుంచి రావలసిన నిధులు రాబట్టడంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. విరాళాలు రూపంలో దాతలు అందించిన మొత్తం కేంద్రం ప్రకటించిన సాయంపై సవివరంగా ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలు, కరెంట్ ఛార్జీలతో సామాన్యుడి బతుకు చిత్రం భారంగా మారిపోయిందని మల్లాది విష్ణు మండిపడ్డారు. మరోసారి వడ్డనకు సిద్ధమైతే ప్రజలు ఈ రాష్ట్రంలో బతికే పరిస్థితి ఉండదని దుయ్యబట్టారు. రాష్ట్ర జిఎస్‌టిపై అదనపు సర్ ఛార్జీ విధింపు ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని కోరారు.

నందిగామ సిద్ధార్థలో పిల్లల పండుగ

ప్రజాశక్తి - నందిగామ : అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ వేడుకల్లో నందిగామ జయ సిద్దార్థ్ పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ ప్రదర్శించారు. వైభవంగా ప్రారంభమైన ఈ బాలోత్సవంలో సుమారు 200 పాఠశాలల నుండి 15 వేల మందికిపైగా విద్యార్థులు భాగస్వాములై ఆయా రంగాల్లో తమ ప్రతిభా పాట వాలను ప్రదర్శించారు. జానపద, క్లాసికల్ నృత్యాలు, విచిత్ర వేష ధారణలు, చిట్టి చేతులతో మట్టి బమ్మలు చేయడం వంటి వివిధ రకాల పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గన్నారు. పోటీలకు వేదికగా ఉన్న సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. వివిధ అంశాల్లో పోటీపడటానికి నందిగామ సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం, ఫోక్ డాన్సులు, వేస్ట్ ఫ్రమ్ ద బెస్ట్, భరతనాట్యం, కూచిపూడి, మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాల లో పాల్గొని ప్రతిభ ప్రదర్శించారని సిద్ధార్థ హై స్కూల్ కరెస్పాండెంట్ రామ్మోహన్ రావు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పేదలకు సేవలు ప్రశంసనీయం

భవానీపురం ఎస్ఐ సుమన్

ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - భవానీపురం : పేద బడుగు బలహీన వర్గాలకు ప్రజా వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ శ్రావణ్ కుమార్ సేవలు అభినందనీయమని భవానీపురం పోలీసు స్టేషన్ ఎస్ఐ సుమన్ అన్నారు. ఆదివారం జాతీయ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజా వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎస్ఐ సుమన్ ప్రారంభించారు. కబేళా సెంటర్ సమీపంలో ఆర్ఆర్ నగర్‌లో సివిఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ప్రజా వైద్యశాలలో ఉచిత మెగా వైద్య పరీక్షలు శిబిరంలో వైద్య నిపుణులైన ప్రముఖ కార్డియాలజిస్టులు డాక్టర్ సాయి ప్రకాష్, డాక్టర్ సిరిల్ ఫిలిప్స్ గుండెకు సంబంధించిన వైద్య సేవలందించారు. జనరల్ మెడిసన్ విభాగంలో డాక్టర్ ఎమ్ఆర్ఎస్ హరి హరన్, డాక్టర్ సుజాత జనరల్ వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ రావెళ్ల రాజ్ కుమార్ నేత్ర వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో మొత్తం 350 మంది రోగులకు ఉచిత వ్యాధి నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత సేవలు అందించిన వైద్యులకు, ప్రజా వైద్యశాల సేవలు ఉపయోగించుకున్న రోగులకు ప్రజా వైద్యశాల ఎమ్.డి.డాక్టర్ వాండ్రాసి శ్రవణ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యాదవులు రాజకీయ అవకాశాలు అందిపుచ్చుకోవాలి : ఏలూరు ఎంపి

ఏలూరు ఎంపి మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరువూరు : యాదవ సంఘీయులు రాజకీయ అవకాశాలను అంది పుచ్చుకుంటూ ముందుకు సాగాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. పట్టణ పరిధిలోని కోకిలంపాడు రహదారిలో గల మామిడి తోటలో నియోజకవర్గ యాదవ సామాజిక వర్గం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధన కార్యక్రమానికి ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సామాజిక వర్గం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలని, అందుకు తన వంతు తోడ్పాటు అందిస్తానని ఎంపి తెలిపారు. యాదవ సంగీయులు ఆర్థికంగా, సామాజికంగా పురోగతిని సాధించాలని ఎంపీ సూచించారు. ఇతర సామాజిక వర్గాలతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ యాదవ సంఘీయులు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఎంపిగా విజయం సాధించిన అనంతరం తొలి సారి తిరువూరు వచ్చిన ఎంపీ మహేష్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు శాలువాలతో సన్మానించారు.

పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు

విజయవాడ : చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్య నారాయణ పురంలో డిజిటల్ గ్రంథాలయాలఖ్యాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యావేత్త బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీ, సాంప్రదాయ లైబ్రరీకి గల వ్యత్యాసాన్ని గురించి వివరించారు. ఇండియాలో డిజిటల్ లైబ్రరీ 1971న, విశ్వేశ్వరయ్య ఇన్స్టిట్యూట్ వారిచే రూ.17వేల పుస్తకాలతో ఇండియాలో ప్రారంభించినట్లు తెలిపారు. ఏ విషయం కావాలన్నా డిజిటల్ ఆన్లైన్ ద్వారా క్షణాల్లో తెలుసుకో వచ్చని అన్నారు. నేటి డిజిటల్ యుగంలో సమాచారం, విజ్ఞానాన్ని కోరుకొనే విద్యార్థులు సాంప్రదాయ లైబ్రరీలు మాత్రమే ఎంపిక కాదని ఎలక్ట్రానిక్ లైబ్రరీలు లేదా ఇ- లైబ్రరీ ఆవిర్భావం విద్యార్థులకు సమాచారాన్ని యాక్సెస్ చేసే విధానాన్ని మార్చిందని అన్నారు. ఇది గతం కంటే సమాచారం కనుగొనడం తిరిగి పొందడం సులభం, వేగంగా, సౌకర్య వంతం చేస్తుందని అన్నారు. ఇ-లైబరీ ద్వారా వారి పరిశోధన నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు సాంప్రదాయ లైబ్రరీల్లో అందుబాటులో లేని డిజిటల్ మెటీరియల్ ఇ-లైబ్రెరీల ద్వారా డిజిటల్ లైబ్రరీపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. అనంతరం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. చిత్ర లేఖనం పోటికి న్యాయనిర్ణేతగా డ్రాయింగ్ టీచర్ ఆర్.రఘునాథం వ్యవహరించారు. మొదటిగా వారు డ్రాయింగ్ బేసిక్స్, అవుట్ లైన్ బ్లాక్, పెన్సిల్ హెడ్డింగ్, వేరియంట్ కలర్స్, ఫ్రేమ్ వర్క్ గురించి వివరించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిలో ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు చిత్ర లేఖనం పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి చిత్ర లేఖనంలో కొంత అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ కె.కె.ప్రణీత, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. 17 మంది విద్యార్థులు మెంబర్ షిప్ తీసుకున్నారన్నారు. జాతీయ నాయకుల చరిత్రలు మంచి కథల పుస్తకాలు ఇండ్లకు కూడా తీసుకుని వెళ్ళడానికి చిన్నారులు రూ.100లు డిపాజిట్ చేసి సభ్యత్వం తీసుకుంటే పుస్తకాలు ఇళ్లకు కూడా తీసుకెళ్లి చదువుకోవచ్చని తెలిపారు. **మైలవరం :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మైలవరం శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చిలుకూరు వారి గూడెం ప్రభుత్వ పాఠశాల ఎస్‌జిటి ఉపాధ్యాయులు డివిఎస్.ప్రసాద్ న్యాయ నిర్ణయితగా వ్యవహరించారు. లీలావతి పాఠశాల ఉపాధ్యాయురాలు కె.జ్యోతి వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **తిరువూరు :** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా తిరువూరు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. 10వ తరగతి వరకు తల్లిదండ్రుల సంరక్షణలో విద్యార్థులు జాగ్రత్తగా పెరుగుతారని, ఇంటర్ చదవడం ప్రారంభించినప్పటి నుండి స్వేచ్ఛకు అలవాటుపడి కొంతమంది విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి మత్తులో ఏమి చేస్తున్నారో తెలియకుండా హంతకులుగా, సంఘ విద్రోహశక్తులుగా మారుతూ కుటుంబాలకు దూరమౌతున్నారని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పద్మావతి పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ గ్రంథాలయం లో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పారేపల్లి సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి యస్.కె. నాగుల్ మీర, జిల్లా అధ్యక్షుడు పేరం అర్లప్ప నందిగామ మండల అధ్యక్షులు రాటకొండ సుభాకర్, ప్రధాన కార్యదర్శి యస్‌కె.నాగుల్ మీర, పెనుగంచిప్రోలు మండల గౌరవ అధ్యక్షులు కె.రామకృష్ణ, కోశాధికారి ఖుద్దూస్ పాల్గొన్నారు. **నందిగామ :** నారాయణ ఆంగ్లో వేదిక్ స్కూల్ విద్యార్థులచే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలపై విద్యార్థులు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడే బాధ్యత మన అందరికీ ఉందని, ప్రకృతి వనరులను దుర్వినియోగం చేయకూడదని, ప్లాస్టిక్ వస్తువులు వాడటం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని, ప్లాస్టిక్ వస్తువుల వల్ల గాలి, నీరు కలుషితం అవుతుందని తెలిపారు. అనంతరం గ్రంథాలయ అధికారి మస్తాన్ వలి మాట్లాడుతూ స్కిప్పింగ్ (తాడు ఆట)లో పోటీలు నిర్వహించామని ఆంగ్లో వేదిక్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాటకొండ కోటేశ్వరరావు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, రమేష్ బిసి నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం తిరువూరు మండల కార్యదర్శిగా నరసింహారావు

ప్రజాశక్తి - తిరువూరు :

సిపిఎం తిరువూరు మండల కార్యదర్శిగా రాచ బంటి నరసింహా రావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మండలం లోని ముసు కుల్ల గ్రామంలో సిపిఎం మండల మహాసభ టి.వెంకటేశ్వరరావు అధ్య క్షతన శని వారం జరిగింది. నరసింహా రావు కార్యద ర్శిగా కమిటీ సభ్యులుగా సాంబారు వెంకటే శ్వర్లు, తోట శ్రీనివాసరావు, ముత్తమ్మ, ఇసుకల వెంకటేశ్వరరావు గద్దల కృష్ణ తాళ్లూరు ఉద్దండు తదితరులు ఎన్నికయ్యారు. మహా సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ హాజరై జనవరి 3,4,5 తేదీల్లో తిరువూరులో జరగబోయే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

త్వరలో కాల్వలకు మరమ్మతులు చేయిస్తాం

ప్రజాశక్తి - భవానీపురం :

ఇటీవల బుడమేరు వరద నీటి వల్ల పాడైన కాల్వలకు మరమ్మతులు చేయిస్తామని మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్ పరిధిలోని శివాలయం సెంటర్లో లలితానగర్ వెళ్లే మెయిన్ రోడ్డులో గతంలో వచ్చిన బుడమేరు వరదల వల్ల పాడైపోయిన కాలువను పరిశీలిస్తున్న రామయ్య ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంఎల్‌ఎ, ఎంపి దృష్టికి తీసుకెళ్లి కాల్వ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ బూత్ ఇంచార్జి నాగభూషణం, 46వ బూత్ ఇన్చార్జి బోయపాటి శ్రీనివాస్, నెలకుర్తి శ్రీనివాస్, యువ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ ఫ్యూచర్ టెక్ స్కిల్స్‌లో విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

శామ్‌సంగ్ 2024 సంవత్సరానికి శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు టెక్ స్కిల్స్ పై శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ ఇన్చార్జి కుమార్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యూచర్ టెక్ స్కిల్స్‌పై 3,500 మంది విద్యార్థుల సర్టిఫికేషన్‌ను పూర్తి చేసిందని తెలిపారు. స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా కార్యక్రమాలకు అనుగుణంగా, శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ద్వారా శిక్షణ అందిస్తున్నామని అన్నారు. యువతకు ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్థింగ్స్, బిగ్ డేటా, కోడింగ్, ప్రోగ్రామింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న సాంకేతిక రంగాలలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఉపాధిని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తుందని తెలిపారు. శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ సీఎస్ఆర్ చొరవ 2023లో 3,000 మంది విద్యార్థులను చేర్చుకోవడం నుండి 2024లో 3,500 మంది విద్యార్థులను చేర్చుకోవడం ద్వారా తన పరిధిని విస్తరించిందని చెప్పారు.

గుడివాడ గ్రంథాలయంలో విద్యార్థుల ప్రదర్శన

అవనిగడ్డ గ్రంథాలయంలో మాట్లాడుతున్న వీరకుమారి

ఘంటసాల గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎస్ఐ

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - చల్లపల్లి : స్థానిక శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థి విద్యార్థులకు క్విజ్ డిబేట్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలలో ఎస్వీఆర్ఎస్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. లక్ష్మీపురం ఎంపీ యూపీ పాఠశాల నుండి ఎల్ నాగరాజు జడ్.పి.హెచ్.ఎస్ నుండి క్రాఫ్ట్ టీచర్ సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను గ్రంథాలయ శాఖ అధికారి గణేష్ కుమార్ పర్యవేక్షించారు. **గుడ్లవల్లేరు :** స్థానిక గ్రేటు2 శాఖా గ్రంథాలయం వద్ద ఆదివారం కవి సమ్మేళనంలో భాగంగా కష్ణ స్వామి, సామ్రాజ్యం కొన్ని కవితలు వినిపించారు. జూనియర్, సీనియర్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు ఈనెల 20వ తేదీ ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారిని తెలిపారు.

ఘంటసాల: విద్యార్థులు సమయపాలన పాటిస్తూ పట్టుదల అంకితభావంతో ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని చదువులో మంచి ఫలితాలు సాధిస్తూ సమాజంలో గుర్తింపు పొందాలని ఎస్ఐ కె. ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఘంటసాల గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎం. శరత్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి పలు అంశాలపై సమగ్రంగా వివరించారు. ఎస్సై ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతిక్షణం చదువుపై శ్రద్ధ వహించి వద్ధిలోకి రావడం ద్వారా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎం .శరత్ కుమార్, స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు శివ నాగలక్ష్మి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం నాలుగో రోజు కవి సమ్మేళనాలు, రచయితల సందేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేములపల్లి కేశవరావు, విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్ అండ్ శంకర ఆనంద్, కవిత్రులు దివి ఝాన్సీ, సింహాద్రి పద్మ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు ఏ వీర కుమారి తదితరులు పాల్గొని కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం8,9,10 తరగతి విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ పర్యవేక్షించారు. **గుడివాడ :** స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం, స్థానిక రాజేంద్రనగర్‌లోరి గ్రంథాలయంలో 4వ రోజు ఆదివారం లఘ నాటికల పోటిలను రచిత వసుధ బస్వవేశ్వరరావు నిర్వహించారు. ఈ కార్యక్రమల్లో గ్రంథాలయ అధికార్లు బీరం వెంకటరమణ, పి.శాంతి, సభ్యులు డిఆర్‌బి ప్రసాద్, అవిరినేని వెంకటేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళ్యాణ్

26న ధర్నాను జయప్రదం చేయండి

రౌండ్‌టేబుల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - నందిగామ : సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు 26న నందిగామ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్ పిలుపునిచ్చారు. ఆదివారం నందిగామ సుందరయ్య భవన్‌లో రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ కుల, మత, ప్రాంతీయ ఆర్థిక స్థోమతలతో నిమిత్తం లేకుండా స్వాతంత్ర్య ఫలాలందాలని అన్నారు. వ్యవసాయ పంటలకు సరైన మద్దతు ధరలు లేక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రకృతి పైపరీత్యాలు, చీడ-పీడలు, ధరల పతనం, రుణభారంల వల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో ఒక్క పర్యాయం పంట రుణాల బకాయిలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కె.గోపాల్ మాట్లాడుతూ 26న నందిగామ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా రైతులు, కార్మికులతో పాటు సామాన్య ప్రజానీకం యువకులు, మహిళలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ ఖాసిం, సిఐటియు నాయకులు బొడ్డు రాము, వేల్పుల ఏసోబు, దారా నాగేశ్వరరావు, కర్రీ వెంకటేశ్వరరావు, హసేన్, రైతు సంఘం నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, చెరుకుమల్లి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన బుద్వేశ్వరస్వామి దేవస్థానం

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని నడకుదురు శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శ్రీ బుద్వేశ్వరస్వామి వారి దేవస్థానం కార్తీక మాసం సందర్భంగా భక్తులతో కిటకిటలా డింది. ఆదివారం నియోజకవర్గంతో పాటు ఏలూరు, నూజివీడు, ద్వారకా తిరుమల, విజయవాడ, గుడివాడ, పామర్రు, కూచిపూడి, మచిలీపట్నం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి సేవలో తరించారు. క్యూలైన్ ద్వారా పథ్వీశ్వర స్వామి వారిని - బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించు కున్నారు. దేవస్థానం అనువంశిక వేద పండితులు స్వామి వారికి - అమ్మవారికి విశేష అలంకరణ గావించి పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆలయం చెంతనే ఉన్న దేవతావనంలో పరమ పవిత్రమైన, అరుదైన పాటలీ వక్షాలు సందర్శించి లక్ష్మీ నారాయణ స్వామిని, నాగేంద్ర స్వామిని దర్శించుకున్నారు.

పలుచోట్ల వనసమారాధనలు

ప్రజాశక్తి-గుడివాడ : రాష్ట్రంలోని బడుగు వర్గాలకు అండగా సియం చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి అన్నివేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో స్వర్ణ భక్తుల సంక్షేమ సంఘ కార్తీక వన సమారాధనలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణ భక్తుల సంఘీయుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనతరం వన సమారాధనలో భాగంగా నిర్వహించిన వనభోజనాలను ప్రారంభించారు.

భోజనం వడ్డిస్తున్న ఎంఎల్ఎ రాము

3295 రోజుకు 'స్వచ్ఛ సుందర చల్లపల్లి'

ప్రజాశక్తి - చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు శనివారం వేకువ సమయంలో 216వ రహదారి మీది అర్థ నిర్మిత కల్యాణ మండపం వద్దనే తమ వాహనాలను నిలుపుకొన్న కార్యకర్తలు అక్కడికి కిలోమీటరు దూరందాక రకరకాల శ్రమదానం చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను, పిచ్చి మొక్కలను తొలగించారు. వీధులను పరిశుభ్రం చేశారు. త్వరలో నాటుబోయే వందల అది మొక్కలకు కొలతలు ప్రకారం గోతులు తీశారు. రహదారి కిరువైపులావున్న తొలగించిన ములకంపలను పొదలను మహిళలు ట్రాక్టర్‌పై తొలగించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛచల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులను తల్లిదండ్రులు గమనించాలి

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : చిన్నారులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని, చెడు అలవాట్లకు గురైతే తగు చర్యలు తీసుకోవాలని గుడ్లవలేరు ఎస్ఐ సత్యనారాయణ కోరారు. మండలంలోని కవుతరం గ్రామంలోని ప్రధాన సెంటర్లో ఆదివారం రాత్రి గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నారులు చెడు వ్యసనాల బారిన పడే కార్యక్రమాలు జరిగితే పోలీసులకు తెలియపరచాలని, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. సెల్ఫోన్లో మాట్లాడుతూ వాహనాల నలపరాలని సోషల్ మీడియాలో అనుచితమైన పోస్టులు పెట్టకూడదని అలా పెట్టిన మెడల వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల

పమిడిముక్కలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం తోలిన వెంటనే రైతులకు డబ్బులు వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మండలంలోని తాడంకి, మంటాడ, లంకపల్లి గ్రామాలలో కొనుగోలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రాలలో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల గ్రామ సర్పంచ్ ప్ర ముళ్ళపూడి సునీత, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, శిలువి బాబు, యార్లగడ్డ రాజేంద్రప్రసాద్, మైనేని నరేంద్ర, వ్యవసాయ శాఖాధికారి గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు 186 బూత్ నీలకంటేశ్వరపురం వద్ద టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బూత్ ఇంచార్జ్ వల్లభనేని రంగబాబు, సాయి, శ్రీహరి, చిట్టి, దారా సత్యనారాయణ, శివాజీ పాల్గొన్నారు.

రామ్మూర్తికి నివాళి

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో నారా రామూర్తినాయుడు మరణానికి చింతిస్తూ గన్నవరం ఎంఎల్ఎ కార్యాలయంలో నారా రామ్మూర్తి నాయుడు చిత్ర పటానికి నివాళు లర్పించారు. టిడిపి గన్నవరం మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండల రైతు అధ్యక్షులు అరుమాళ్ళ కృష్ణారెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి జూపల్లి సురేష్ , రాష్ట్ర మహిళా కార్యదర్శి మండవ లక్ష్మి, మండలం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ అబుల్యాజ్ , మండల తెలుగుయువత అధ్యక్షులు చీమలదండు శివ రామకష్ణ, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు మండవ అన్వేష్, కాంతారావు పాల్గొన్నారు.
గుడివాడ : స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజా వేదికలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం నారా రామ్మూర్తి నాయుడు సంతాప కార్యక్రమాన్న నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.
అవనిగడ్డ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మతి పట్ల అవనిగడ్డ టిడిపి నాయకులు నివాళు లర్పించారు ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కబడ్డీ అసోసియేషన్ కి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారని ఆయన బాడీ బిల్డర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు పార్టీ సీనియర్ నాయకులు పర్చూరు దుర్గాప్రసాద్ గుత్తికొండ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు యుబిఐ చేయూత

విజయవాడ : ఎంపవర్ హెర్ అండ్ పవర్ హిమ్ కార్యక్రమం కింద కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో వసతిగృహ విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ బ్రాంచ్ చేయూతనందించింది. ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు పాయకాపురంలోని మూడు వసతిగృహాలకు 30 సీలింగ్ ఫ్యాన్లు, 30 ట్యూబ్‌లైట్లు, మూడు వెట్ గ్రైండర్లు, మూడు మిక్సీలు, మూడు గ్యాస్‌స్టవ్‌లు అందజేశారు. రెండువేల లీటర్ల సామర్థ్యమున్న సింటెక్స్ నీటి ట్యాంకు, దోమల తెరలతో పాటు అమ్మాయిలకు శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యుబిఐ జోనల్ మేనేజర్ సివిఎన్ భాస్కరరావు, రీజనల్ మేనేజర్ ఎం.శ్రీధర్, డిప్యూటీ జోనల్ మేనేజర్ శారదా మూర్తి, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు ఐఎస్ఎస్ మూర్తి, హరీష్ బేతా, ఎజిఎం (ఎస్-ఎల్‌బిసి) డి.శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ ప్రవీణ, ఎన్‌టిఆర్ జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా ఎల్‌డిఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో తాగునీటి వసతి

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : దీవిస్ లేబరేటరీస్ లిమిటెడ్ సిఎండి దివి.మురళీ కృష్ణ సహకారంతో స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన జలప్రసాదంను ఎంఎల్‌ఎ శ్రీరాం తాతయ్య ఆదివారం ప్రారంభించారు. యాత్రికుల సౌకర్యార్థం రూ.66 లక్షలతో ఏర్పాటు చేయడం గొప్పవిషయమని ఎంఎల్‌ఎ తెలిపారు. అనేక సేవా కార్యక్రమాల్లో అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య. మాజీ ఎంపిపి వేగినేటి గోపాలకష్ట మూర్తి, మాజీ జెడ్‌పిటిసి గజ్జి కృష్ణ మూర్తి, మాజీ చైర్మన్ కాకాని శ్రీనివాసరరావు, గింజుపల్లి. గోపి, కొత్తపల్లి సతీష్ కుమార్, దేవస్థానం ఇఒ కిషోర్ కుమార్. చైర్మన్ జంగాల శ్రీనివాసరరావు. దివిస్ లేబరేటరీస్ వారి సిబ్బంది బి.కిషోర్ కుమార్, బి.గోపి, ఎస్.సాయి కృష్ణ, సిహెచ్.శ్రీనివాసులు, ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన, గోపి.ఆలయ ఇంజనీరింగ్ ఇఇ రమా ఎఇలు, రాజు, అరవింద్, మండల బిజెపి అధ్యక్షురాలు కల్లూరి, శ్రీవాణి. జనసేన నాయకులు తునికి పాటి శివా, ఆలయపాలక మండలి సభ్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రఘునందన్‌కు పురస్కారం

ప్రజాశక్తి - తిరువూరు : ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్‌కు ఎక్స్ రే సాహితీ సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన వచన కవితల పోటీలో 'మా ఊరి గొడుగై' కవితకు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ప్రముఖ సాహితీ వేత్తలు మొండెపు ప్రసాద్, మంగారి రాజేందర్, సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బి. ఆంజనేయ రాజు ప్రదానం చేశారు. పలు పత్రికల్లో కవితలు, కథలు, వ్యాసాలు రచించడమే కాక ఆకాశవాణి విజ యవాడ కేంద్రం నుండి అనేక ఉపన్యాసాలు, కథలు, కవితా పఠనం ద్వారా సుపరిచితులన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సెంటినీ సిటీ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. సెంటినీ సిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో, కరెంట్ మెడికల్ అప్డేట్-1 సిఎంఇ నిర్వహించారు. ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ నవీన్ తోట నేతృత్వంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో ఆదివారం జరిగిన ఈ సదస్సులో డాక్టర్ మొవ్వ పద్మ మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య చికిత్సలను చేరువ చేసేందుకు ఈ సిఎంఇ దోహదపడుతుందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో న్యూరాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాలతో పాటు పార్కిన్సన్స్ వ్యాధికి సంబంధించిన అత్యాధునిక వైద్య చికిత్సల గురించి కరెంట్ మెడికల్ అప్డేట్-1 సిఎంఇలో సమగ్రంగా చర్చ జరిపారు. 470 మంది వైద్యులు పాల్గొన్న ఈ సదస్సులో వివిధ అంశాలపై సంబంధిత విభాగాల నిపుణులు ప్రసంగించారు. ఆధునిక చికిత్సా పద్ధతులు, చికిత్సల్లో ఎదురయ్యే సవాళ్ల గురించి నిపుణులు తమ ప్రసంగాల్లో వివరించారు. సిఎంఇ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ తోట నవీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఈ మొట్టమొదటి ప్రత్యేక చికిత్సా విభాగం ద్వారా పార్కిన్సన్స్ వ్యాధికి ఆధునిక చికిత్సలను అందిస్తున్నామని చెప్పారు. న్యూరాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాల్లో ఆధునిక చికిత్సలతో పాటు పార్కిన్సన్స్ వ్యాధికి అత్యాధునిక శస్త్రచికిత్సా పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఈ సిఎంఇలో సెంటినీ సిటీ హాస్పిటల్ చైర్మన్ మొవ్వ ఆనంద్, డైరెక్టర్ మొవ్వ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న ప్రముఖులు

కృష్ణా వర్శిటీ వెయిట్ లిఫ్టింగ్‌లో కెబిఎన్‌కు పతకాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీలలో కెబిఎన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఎస్‌కెపివి హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. విద్యార్థులు సాధించిన మెడల్స్ వి.రక్షిత 87 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో, పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. టి.అరుణ నాగదుర్గ 81 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్, బి.సత్య 50 కేజీల వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్, వి.సుప్రియ 57 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, బి.లోకేశ్వరి 57 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ బ్రాంచ్ మెడల్ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఏం.నందిని 57 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ గోల్డ్ మెడల్, పవర్ లిఫ్టింగ్ సిల్వర్ మెడల్, పురుషుల పవర్ లిఫ్టింగ్ విభాగంలో పి.భరత్ కుమార్ 66 కేజీల విభాగంలో తనదైన రికార్డులో 635 కేజీలు రికార్డుతో గోల్డ్ మెడల్ సాధించాడు. త్వరలో జరగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలు గుల్బర్గా విశ్వవిద్యాలయం కర్ణాటకలో జరిగే పోటీలకు ఎంపిక అయ్యారు.

మహిళల విభాగంలో వి.రక్షిత వెయిట్ లిఫ్టింగ్ పోటీలు త్వరలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీకి ఎంపిక కావటం గమనార్హం అని తెలిపారు. పురుషుల విభాగంలో బెస్ట్ ఫిజిక్ పోటీలో ఆర్.యశ్వంత్ 70 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎం.శ్రీనివాస్ 70 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, కె.హరికృష్ణ 65 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, పి.కిరణ్ కుమార్ 75 కేజీల విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించారని తెలిపారు. విద్యార్థుల్ని తీర్చిదిద్దిన కళాశాల క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావును కళాశాల యాజమాన్యం, సభ్యులు, వైస్.ప్రిన్సిపాల్ పిఎల్.రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అమరావతి సూపర్ స్పెషాలిటీ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ వేణు నాదెళ్ళ, తెలుగు యువత నాయకులు దాడి మురళీకృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం పంజా సెంటర్లో నిర్వహించిన శిబిరాన్ని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. మానవతా దృక్పథంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా ఆపరేషన్లను నిర్వహిస్తున్నామని మురళీకృష్ణ అన్నారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 30 మందికి కళ్ళజోళ్ళు, 40 మందికి ఆపరేషన్లు అవసరమయ్యాయని వారికి అమరావతి సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిలో వైద్య సేవల ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ వేణు నాదెళ్ళ కూటమినేతలు దాడి జగన్, సప్పా శ్రీనివాసరావు, ఇంతియాజ్, పెంటపల్లి బాబ్జి, అరవింద్, దినేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజయవాడ మారథాన్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ రన్నర్ అధ్వర్యంలో ఆదివారం నగరంలో జరిగిన విజయవాడ మారథాన్ ఉత్సాహభరితంగా జరిగింది. మారథాన్‌లో భాగంగా ఉదయం 5 గంటలకే నగరంలోని యువత, పెద్ద వారు అందరూ మారథాన్‌లో పాల్గొనేందుకు జింఖానా గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. ఉదయం 5 గంటలకు మారథాన్‌కు జి.ఎస్‌టి అండ్ కస్టమ్స్ కమిషనర్ ఎస్.నరసింహా రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో ప్రతి సంవత్సరం మారథాన్ నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. శ్రీరామ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ వై.ఆర్.ఇ.ఫణి కుమార్ మాట్లాడుతూ విజయవాడ మారథాన్‌లో ప్రతి ఏటా పాల్గొనేవారి సంఖ్య పెరుగుతుందన్నారు. నగర వాసులకు నడక, ఆరోగ్యంపై అవగాహన కోసం ఈ మారథాన్ గత ఎనిమిది సార్లు నిర్వహించారన్నారు. ఇపుడు నిర్వహించిన ఈ మారథాన్‌లో నగరవాసులు అన్నీ వర్గాల వారు పాల్గొన్నారన్నారు. ఆప్ కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎస్.రెడ్డి, మారథాన్ ఆర్గనైజర్ మని దీపక్ మాట్లాడుతూ 1,800 మంది పాల్గొన్నారని అన్నారు. ఈ మారథాన్‌లో కలశాల యువత, విద్యార్థులు, నగర వాసులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారని అన్నారు. 21 కిలో మీటర్ల నడక, 10కె, 5కె నడక పోటీలు గత ఏడాది కన్న పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని అన్నారు. మూడు కేటగిరీలలో విజేతలకు రూ.75 వేలు నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. మారథాన్‌లో పాల్గొన్న వారికి లత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్య సేవలందించిందన్నారు. మారథాన్‌లో పాల్గొన్న వారందరికీ డిజిటల్ సర్టిఫికెట్ అందిస్తామన్నారు. మారథాన్ నిర్వహణలో నాగేశ్వరరావు, పార్ధు పలువురు సహకరించారని తెలిపారు.

పండ్లతో అలంకరణ

ప్రజాశకి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ సహదేవతా మూర్తులు కార్తీక మాసం మూడో ఆదివారం సందర్భంగా వివిధ రకాల పండ్ల అలంకారంలో యాత్రికులకు దర్శనమిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులు తిరుపతమ్మను దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి భూపతి రాజు సత్యనాగ కిశోర్‌కుమార్, ఆలయచైర్మన్ జంగాల శ్రీనివాసరరావు యాత్రికులకు సౌకర్యాలు కల్పించారు. పలువురు దాతల సౌజన్యంతో పండ్లతో అలంకరించినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని సున్నంపాడు గ్రామం పరిధిలో రోహి బీషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మైలవరం వారు జరిపిన ఆకస్మిక దాడుల్లో అదే గ్రామానికి చెందిన షేక్ ఉద్దాండు అను వ్యక్తి వద్ద 50 మద్యం బాటిల్లు (180 ఎం.ఎల్) అక్రమంగా తెలంగాణ మద్యం ఉన్నందున, వాటిని అమ్మకాలు జరుపుతున్నందున అరెస్టు చేసి మైలవరం ఎక్సైజ్ స్టేషన్లో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పనిలో భాగంగా ఇనుప పైపులను బ్లాక్ పైకి తీసుకువెళ్లే క్రమంలో 11 కెవి విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందిన సంఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చల్లా రత్నకుమార్ (25) విజయవాడ రూరల్ మండలం ఎస్‌ఎఫ్-8, వైఎస్ఆర్ కాలనీలో నివాసం వుంటున్నాడు. చల్లా రత్నకుమార్ ప్లంబింగ్ వర్క్ చేస్తుంటాడు. వివాహం కాలేదు. బ్లాక్ నెం.172, ఎస్‌ఎఫ్-8, వైఎస్ఆర్ కాలనీలో చల్లా తులసమ్మ నివాసం వుంటున్న బ్లాక్‌లో అందరూ కలిసి ప్లంబింగ్ వర్క్ చేయడానికి డబ్బులు తీసుకుని ఆ పనిని చల్లా రత్నకుమార్‌కి అప్పగించారు. రెండు రోజుల నుండి రత్నకుమార్ ఆ బ్లాక్‌లో ప్లంబింగ్ వర్క్ చేస్తున్నాడు. ఆ క్రమంలో ఈనెల 16వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో చల్లా రత్నకుమార్, చల్లా నాగార్జున, తిరుమలకొండ దుర్గాప్రసాద్ పైపులను ఇనుపవి బ్లాక్ పైకి తీసుకువెళ్ళు సమయంలో దగ్గరగా వున్న 11 కెవి కరెంట్ తీగలకు చల్లా రత్నకుమార్ చేతిలో వున్న ఇనుప పైపు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి చల్లా తులసమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.